సాక్షి నల్లగొండ

సోమవారం । 4 । ఆగస్టు । 2025



సాగర్‌కు పర్యాటకుల తాకిడి

కృష్ణమ్మ పరవళ్లను వీక్షించేందుకు ఆదివారం నాగార్జునసాగర్‌కు పెద్ద సంఖ్యలో పర్యాటకులు తరలివచ్చారు.

- 8లో



30గ్రాములకు తగ్గకుండా ప్రసాదం

యాదగిరి క్షేత్రానికి వచ్చే భక్తులకు 30 గ్రాములకు తగ్గకుండా ఉచిత ప్రసాదం అందించాలని ఈఓ సూచించారు.

- 8లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం : 590 అడుగులు

ప్రస్తుత నీటి మట్టం	:	586.00 అడుగులు
ఇన్‌ఫ్లో	:	47,592 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	:	47,592 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	:	28,867 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	:	8,604 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	:	8,022 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	:	1,800 క్యూసెక్కులు
వరద కాల్వకు	:	300 క్యూసెక్కులు

న్యూస్‌రీల్

నేడు నల్లగొండకు మంత్రి కోమటిరెడ్డి రాక

నల్లగొండ : రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సోమవారం నల్లగొండకు రానున్నారు. హైదరాబాద్ నుంచి ఉదయం 8.15 గంటలకు నల్లగొండకు చేరుకుని రూ.200 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌కు భూమి పూజ చేస్తారు. ఆ తర్వాత నూతనంగా నిర్మించిన మంత్రి క్యాంపు కార్యాలయాన్ని ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 2 గంటలకు హైదరాబాద్ బయల్దేరి వెళతారు.

ప్రశాంతంగా టీటీసీ పరీక్షలు

నల్లగొండ : నల్లగొండలో ఆదివారం నిర్వహించిన టెక్నికల్ టీచర్ సర్టిఫికెట్ (టీటీసీ) కోర్సు లోయర్ గ్రేడ్ థియరీ పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు జిల్లా పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ మహ్మద్ యూసుఫుద్దీన్, కోర్సు కోఆర్డినేటర్ కొమ్ము శ్రీనివాసు తెలిపారు. దేవరకొండరోడ్డులోని బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన టైలరింగ్ పరీక్షకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 199 మంది, సెయింట్ ఆల్ఫోన్సెస్ పాఠశాలలో నిర్వహించిన డ్రాయింగ్ పరీక్షకు 250 మంది హాజరైనట్లు వెల్లడించారు.

బుద్ధవనాన్ని సందర్శించిన నటి యమున



జ్యోతి వెలిగిస్తున్న సినీ నటి యమున

నాగార్జునసాగర్ : సినీనటి యమున ఆదివారం బుద్ధవనాన్ని సందర్శించారు. పది రోజులుగా నాగార్జున విపస్యన ధ్యాన కేంద్రంలో జరిగే విపస్యన కోర్సుకు హాజరయ్యారు. కోర్సు పూర్తికావడంతో బుద్ధవనాన్ని సందర్శించారు. మహాస్థూపంలోని పంచముఖ బుద్ధుడి వద్ద జ్యోతి వెలిగించారు. నిర్వాహకులు రవిచంద్ర ఆమెను పంచశీల కండువాతో సత్కరించారు. అనంతరం గైడ్ సత్యనారాయణ మహాస్థూపం, ధ్యానవనం, జాతకపార్కు విశేషాలను వారికి వివరించారు. సమావేశ మందిరంలో బుద్ధవనం లఘు చిత్రాన్ని వీక్షించారు.

కేంద్ర పథకాలపై ఇంటింటి ప్రచారం

రామగిరి (నల్లగొండ): కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలపై ఆదివారం మండలంలోని వెలుగుపల్లి పోలింగ్ బూత్‌లో ఆ పార్టీ స్థానిక ఎన్నికల జిల్లా ప్రభారి బూర నర్సయ్యగౌడ్, జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి ప్రజలకు అవగాహన కల్పించారు. మహాసంపర్క్ అభియాన్‌లో భాగంగా ఇంటింటికి తిరిగి కేంద్ర పథకాలను వివరించారు. కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి మాదగోని శ్రీనివాస్‌గౌడ్, వీరెల్లి చంద్రశేఖర్, పోతేపాక లింగస్వామి, బోగరి అనిల్‌కుమార్, బాకి నర్సింహ, సురుకంటి వెంకట్‌రెడ్డి, చింతపల్లి వెంకన్న, పోతెపాక శంకర్, కాప్రోజు సైదాచారి తదితరులు పాల్గొన్నారు.


ఇద్దరు హెడ్‌కానిస్టేబుళ్లు సస్పెన్షన్

పెన్‌పహాడ్ : భూ తగాదాలో ఇద్దరిపై దాడి చేసిన హెడ్ కానిస్టేబుళ్లను సస్పెండ్ చేసినట్లు డీఎస్పీ ప్రసన్నకుమార్ తెలిపారు. ఆదివారం పెన్‌పహాడ్ పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ విలేకరులతో మాట్లాడారు. నేరేడుచర్ల మండలం బక్కయ్యగూడెం గ్రామానికి చెందిన శానం వెంకటేశ్వర్లు కుమారులు శానం లక్ష్మణ్‌రావు, నాగేంద్రబాబు అన్నెపర్తి 12వ బెటాలియన్‌లో హెడ్ కానిస్టేబుళ్లుగా విధులు నిర్వర్తిస్తున్నారు. జూలై 3న పెన్‌పహాడ్ మండలంలోని లింగాల గ్రామ శివారులో గల వ్యవసాయ భూమి విషయంలో శానం రామలింగయ్య, ఆయన కుమారుడు భరత్‌పై సైకిల్ చైన్లు, గొడ్డలితో హెడ్‌కానిస్టేబుళ్లు దాడిచేసి గాయపరిచారు. ఈ విషయమై బాధితుడు రామలింగయ్య పెన్‌పహాడ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. విచారణ చేపట్టిన ఎస్‌ఐ గోపికృష్ణ నివేదికను ఎస్పీకి అందజేశారు. ఎస్పీ ఆ నివేదికను 12వ బెటాలియన్ కమాండెంట్‌కు పంపారు. దీంతో దాడికి పాల్పడిన హెడ్ కానిస్టేబుళ్లను విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు 12వ బెటాలియన్ కమాండెంట్ తెలిపారని డీఎస్పీ వివరించారు.

యాదగిరి క్షేత్రంలో కోలాహలం

యాదగిరిగుట్ట: యాదగిరి క్షేత్రంలో కోలాహలం నెలకొంది. నిత్యారాధనలు, భారీగా తరలివచ్చిన భక్తులతో ఆలయం, పరిసరాలు సందడిగా మారాయి. వేకుజామున స్వామివారి మేల్కొలుపులో భాగంగా సుప్రభాత సేవ చేపట్టిన అర్చకులు.. ఆ తరువాత గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తును అభిషేకం, సహస్రనామార్చనలతో కొలిచారు. సాయంత్రం వెండిజోడు సేవను ఆలయంలో భక్తుల మధ్య ఊరేగించారు. రాత్రి శ్రీస్వామికి శయనోత్సవం నిర్వహించి ద్వారబంధనం చేశారు.

భవనాలు ఎక్కువ.. రాబడి తక్కువ!



- నీలగిరిలో 43 వేల భవనాలు
- ఆదాయం మాత్రం రూ.18 కోట్లే..
- రీ అసెస్‌మెంట్ చేస్తే మున్సిపాలిటీ ఆదాయం పెరిగే అవకాశం

నల్లగొండ టూటౌన్ : నీలగిరి పట్టణంలో ఉన్న భవనాలకు తగ్గట్టుగా మున్సిపాలిటీకి వాటి ద్వారా ఆదాయం రావడంలేదు. పట్టణ శివారు పెరగడంతో పాటు ఆయా కాలనీల్లో ఐదారు అంతస్తుల భవన నిర్మాణాలు చేపట్టడం, ఇటీవల పట్టణంలో షాపింగ్ కాంప్లెక్స్‌లు, ప్రైవేట్ విద్యా సంస్థలు, ప్రైవేట్ ఆస్పత్రులు భారీగా వెలిసిన విషయం తెలిసిందే. పెరిగిన పట్టణం కారణంగా సేవలు పెరగడంతో పాటు మున్సిపాలిటీకి ఖర్చులు కూడా పెరిగిపోయాయి. కానీ దానికి తగ్గట్టుగా ఆదాయం సమకూరకపోవడంతో పలు ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

పట్టణంలో 48 వార్డులు

మున్సిపాలిటీ పరిధిలోని 48 వార్డుల్లో 43 వేల భవనాలకు ఇంటి నంబర్లు ఉన్నాయి. ఈ 43 వేల భవనాల ద్వారా అనుకున్న స్థాయిలో ఆస్తి పన్ను రావడంలేదు. 10 సంవత్సరాల నుంచి ఆస్తి పన్ను ద్వారా కచ్చితంగా రావల్సిన ఆదాయం కోల్పోతోంది. 43 వేల భవనాలకు దాదాపుగా రూ.30 కోట్ల వరకు ఆస్తి పన్ను సమకూరాల్సి ఉంటుంది. కానీ ప్రసుతం ఆస్తి పన్ను ద్వారా రూ.18 కోట్లు మాత్రమే వస్తోంది. కొన్ని చోట్ల స్థానిక నాయకుల జోక్యం, కొందరి మున్సిపల్ సిబ్బంది చేతివాటం కారణంగా మున్సిపాలిటీ ఆదాయం కోల్పోవాల్సి వస్తుందనేది బహిరంగ రహస్యమే.

ఐదు అంతస్తులున్నా.. ఒకటి రెండింటికే పన్ను చెల్లింపు

నీలగిరి పట్టణంలోని షాపింగ్ కాంప్లెంక్స్‌లు, ప్రైవేట్ విద్యా సంస్థలు, ప్రైవేట్ ఆస్పత్రులు, కార్ల షోరూమ్‌లను రీ అసెస్‌మెంట్ చేస్తే ఆస్తి పన్ను పెరగనుంది. నాలుగైదు అంతస్తుల భవనాలు ఉన్నవారు ఒక అంతస్తు, రెండస్తులకు మాత్రమే ఆస్తి పన్ను చెల్లిస్తున్నారు. ఉదాహరణకు హైదరాబాద్ రోడ్‌లోని ఓ బైక్ షోరూం భవనం ఐదు అంతస్తులు ఉండగా కేవలం రూ.10 వేలు మాత్రమే ఆస్తి పన్ను చెల్లిస్తున్నారు. ఇదే రోడ్‌లో మరో బైక్ షోరూం వారు అన్ని అంతస్తులకు కాకుండా మూడు అంతస్తులకు రూ.లక్ష మాత్రమే వస్తోంది. అదే విధంగా బోయవాడలోని ఓ ప్రైవేట్ స్కూల్ ఐదంతస్తుల భవనం ఉండగా, కేవలం రెండంతస్తులకు మాత్రమే చెల్లిస్తున్నట్లు తెలిసింది. రామాలయంలో సమీపంలోని ఓ కార్పొరేట్ షాపింగ్ మాల్ భవనం, దానికి సమీపంలోనే ఉన్న మరో షాపింగ్ కాంప్లెక్స్, ఎన్జీ కాలేజీ సమీపంలో ఉన్న ఓ మాల్ భవనం, ఎల్‌వీ బంక్ సమీపంలో ఉన్న మరో రెండు భవనాలు ఇలా అనేక భవనాలకు ఆస్తి పన్ను చాలా తక్కువగా ఉన్నట్లు తెలిసింది. ఇలా ఒక్కటి రెండు కాదు కార్పొరేట్ మాల్స్, పాత భవనాల స్థానంలో కొత్తగా నిర్మించిన దుకాణాలకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం అసెస్‌మెంట్ చేస్తే ఆస్తి పన్ను రూ.18 కోట్ల నుంచి రూ.30 కోట్ల వరకు పెరిగే అవకాశం ఉంది. ఆ దిశగా మున్సిపల్ యంత్రాంగం దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

రీ అసెస్‌మెంట్ చేస్తాం

పట్టణంలో ఎక్కడైనా భవనాలకు ఆస్తి పన్ను తక్కువగా ఉంటే కొలతలు వేసి సరి చేస్తాం. ఇప్పటికే కొన్ని భవనాలకు రీ అసెస్‌మెంట్ చేసి వాస్తవ పన్ను వేశాము. ఇంకా అలాంటి భవనాలు ఏవైనా ఉంటే.. వాటిని కూడా రీ అసెస్‌మెంట్ చేస్తాం.

– సయ్యద్ ముసాబ్ అహ్మద్, మున్సిపల్ కమిషనర్

మున్సిపాలిటీలో పెరిగిన ఖర్చులు

పట్టణంలో పెరుగుతున్న జనాబాకు అనుగుణంగా సేవలందించడం కోసం మున్సిపాలిటీ కొత్తగా జేసీబీలు, ట్యాక్టర్లు, ఇతర వాహనాల కొనుగోలు చేయడంతో నిర్వహణ కూడా భారీగా పెరిగింది. ఆ ఖర్చులకు అనుగుణంగా మున్సిపాలిటీ ఆదాయం పెంచుకునే వెసులుబాటు ఉన్నా ఆ దిశగా దృష్టి సారించడంలేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఒకవేళ మున్సిపల్ సిబ్బంది ఆస్తి పన్ను మదింపు చేయడానికి వెళ్తే స్థానిక నాయకులు ఆపుతున్నారనే విమర్శలు ఉన్నాయి. రీ మదింపు వలన స్థానిక నాయకులకు ఎలాంటి నష్టం జరిగే అవకాశమే లేదు. ఎందకంటే భారీ భవనాలు, సముదాయాలు కట్టిన వారికి ఆ వార్డులో ఓట్లు లేవు అనే విషయం గ్రహించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

●హ్యాపీ ఫ్రెండ్‌షిప్ డే



స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఆదివారం నల్లగొండలోని పద్మావతి కాలనీలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకుంటున్న మహిళలు

బ్యాంకింగ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

- ఎస్‌బీఐ ఎండీ అమర రామమోహన్‌రావు



పెద్దకాపర్తిలో మాట్లాడుతున్న ఎస్‌బీఐ మేనేజింగ్ డైరెక్టర్ అమర రామమోహన్‌రావు

చిట్యాల : స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ)కి దేశవ్యాప్తంగా ఉన్న ఖాతాదారులకు భద్రతతో కూడిన మెరుగైన బ్యాంకింగ్ సేవలతోపాటు బీమా యోజన పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆ బ్యాంకు మేనేజింగ్ డైరెక్టర్(ఎండీ) అమర రామమోహన్‌రావు కోరారు. చిట్యాల మండలం పెద్దకాపర్తి నిర్వహించిన జన సురక్ష అభియాన్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వాలు అందించే వివిధ రకాల సంక్షేమ పథకాలు, వ్యక్తిగత ఆర్థిక లావాదేవీలు మధ్యవర్తుల ద్వారా జరగకూడదనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం జీరో బ్యాలెన్స్‌తో బ్యాంకు ఖాతాలను ఏర్పాటు చేసిందన్నారు. దేశవ్యాప్తంగా యాభై కోట్ల మంది జీరో బ్యాలెన్స్‌తో బ్యాంకు ఖాతాలను కలిగి ఉన్నారని పేర్కొన్నారు. ఈ బ్యాంకు ఖాతాదారులు ఆర్థిక లావాదేవీల్లో ఇబ్బందులు రాకుండా ఉండేందుకుగాను తప్పనిసరిగా పదేళ్లకోసారి రీ-కేవైసీ చేయించుకోవాలని, ఖాతాదారులకు ఆర్థిక భరోసా ఇచ్చేందుకు ప్రధానమంత్రి జనధన్ యోజన, ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన వంటి బీమా పథకాలను అతి తక్కువ ప్రీమీయంతో ఏర్పాటు చేసినట్లు వివరించారు. హైదరాబాద్ సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ సహదేవన్ రాధాకృష్ణన్ మాట్లాడుతూ డిజిటల్ బ్యాకింగ్ సిస్టమ్‌ను మరింత పెంపొందించాలని, వ్యక్తిగత బ్యాంకు ఖాతా వివరాలను అపరిచితులకు తెలియజేయవద్దని సూచించారు. కార్యక్రమంలో బ్యాంకు నెట్‌వర్క్ ఇన్‌చార్జి జనరల్ మేనేజర్లు రవికుమార్‌వర్మ, సతీష్‌కుమార్, డిప్యూటీ జనరల్ మేనేజర్ ప్రియవ్రత మిశ్రా, డీసీఎం కే.శివక్రిష్ణ, లీడ్ బ్యాంకు మేనేజర్ శ్రామిక్, చిట్యాల బ్రాంచి మేనేజర్ సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

గుట్టలో నేటి నుంచి పవిత్రోత్సవాలు



ప్రథమ ప్రాకార మండపంలో యాగశాల

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం పవిత్రోత్సవాలకు సిద్ధమైంది. సోమవారం నుంచి బుధవారం వరకు మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు ఆలయ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయాన్ని మామిడి, అరటి తోరణాలతో అలంకరించారు. యాగ నిర్వహణకు ప్రథమ ప్రాకార మండపంలో యాగశాలను సిద్ధం చేశారు. సోమవారం సాయంత్రం విష్వక్సేన ఆరాధనతో అర్చకులు పవిత్రోత్సవాలకు శ్రీకారం చుట్టనున్నారు. ఈ వేడుకతో పాటు రక్షాబంధనం, మృత్సంగ్రహణం, అంకురార్పణ కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఉత్సవాల రెండో రోజు ఉదయం నవకలశ అభిషేకాలు, నిత్య మూర్తి, మూలమంత్ర, శ్రీనృసింహ, సుదర్శన, దేవతా హవనం కార్యక్రమాలు నిర్వహిస్తారు. రాత్రి విమాన గోపురానికి పూజలు చేసి, శ్రీసుదర్శన చక్రానికి పవిత్ర మాలలు ధరింపజేస్తారు. చివరిరోజు బుధవారం మహా పూర్ణాహుతి నిర్వహించి, స్వామి వారికి పవిత్రమాలలను సమర్పించడంతో పవిత్రోత్సవాలు ముగుస్తాయి.

కాల్వకట్ట తవ్వేస్తున్నారు!

- రైల్వే పనుల కోసం కాల్వ మట్టి తరలింపు
- పట్టించుకోని అధికారులు
- కట్టలు బలహీన పడే ప్రమాదం



ఐలాపురం దారిలో టిప్పర్ల ద్వారా తరలిస్తున్న కాల్వ కట్ట మట్టి

మిర్యాలగూడ : నాగార్జునసాగర్ ఎడమకాల్వ తవ్విన సమయంలో కాల్వ తవ్వకాల మట్టిని కాల్వ పటిష్టత కోసం ఇరువైపులా నింపి ఉంచారు. ఆ మట్టిని ఇప్పుడు మిర్యాలగూడ మండలంలో రైల్వే పనుల కోసం అక్రమంగా తవ్వుతున్నారు. రోజుకు లారీల కొద్దీ మట్టిని తవ్వి తరలిస్తున్నారు. దీని కారణంగా కాల్వ కట్ట బలహీనపడే ప్రమాదం ఏర్పడింది. ప్రస్తుతం ఎడమకాల్వకు నీటిని విడుదల చేయడం వల్ల కాల్వ కట్ట బలహీనపడి గండి పడే ప్రమాదం కూడా ఉంది.

టిప్పర్లతో తరలింపు

మిర్యాలగూడ డివిజన్ పరిధిలోని బీబీనగర్–నల్లపాడు, కుక్కడం– విష్ణుపురం వరకు 55 కిలోమీటర్ల మేర రెండవ రైల్వే లైన్ ఏర్పాటు చేస్తున్నారు. దీనిలో భాగంగా రైల్వే లైన్‌కు కింది భాగాన అవసరమైన మట్టిని సదరు కాంట్రాక్టర్ కొనుగోలు చేసి తరలించాల్సి ఉంది. కానీ మిర్యాలగూడ మండలంలోని రైల్వేస్టేషన్‌కు వెళ్లే మార్గంలో వాటర్ ట్యాంక్ తండా, మైసమ్మకుంటతండా, ఐలాపురం, చిల్లాపురం, నందిపాడు శివారులో ఎన్‌ఎస్పీ కాల్వ కట్ట మట్టిని అక్రమంగా తవ్వి తరలిస్తున్నారు. ప్రొక్లెయిన్లతో తవ్వి టిప్పర్లలో నింపి పగలు రాత్రి తేడా లేకుండా వందల టిప్పర్ల మట్టి తరలిస్తున్నారు. కోట్లు విలువల చేసే మట్టి తరలిపోతున్నా ఎన్‌ఎస్పీ, మైనింగ్ అధికారులు పట్టించుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

మా దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటాం

రైల్వే పనులకు గాను ఎన్‌ఎస్పీ కాల్వ కట్ట మట్టిని తరలించే విషయం మా దృష్టికి రాలేదు. మా దృష్టికి వస్తే వెంటనే చర్యలు తీసుకుంటాం. కాల్వ కట్టల మట్టిని తరలించే అధికారం ఎవరికీ లేదు. మేము కూడా ఎవరికి అనుమతి ఇవ్వలేదు. దీనిపై విచారించి తక్షణమే చర్యలు తీసుకుంటాం.

– వెంకటయ్య, ఎన్‌ఎస్పీ ఈఈ

ప్లాట్ చూపించమంటే.. కాజేశాడు!

- నీలగిరిలో మున్సిపల్ ఉద్యోగి నిర్వాకం
- తన భార్య పేరుమీద ఆ ప్లాట్ రిజిస్ట్రేషన్
- కేసు నమోదు చేసిన టూటౌన్ పోలీసులు

నల్లగొండ టూటౌన్ : నీలగిరి పట్టణంలో వారి ప్లాట్ చూపించాలని మున్సిపాలిటీకి వస్తే.. ఆ ప్లాట్‌ను తన భార్య పేరుమీద అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు ఓ మున్సిపాలిటీ ఉద్యోగి. ప్లాటు అక్రమణ రిజిస్ట్రేషన్ వ్యవహారం విషయంలో సదరు మున్సిపల్ ఉద్యోగిపై కేసు నమోదైనట్లు తెలిసింది. వివరాల ప్రకారం.. నల్లగొండ పట్టణానికి చెందిన సరళమ్మ తనకు పిల్లలు లేకపోవడంతో వృద్ధాప్యంలో ఎవరికీ చెప్పకుండా ఎటో వెళ్లిపోయింది. ఆమెకు సంబంధించిన ఓ ప్లాటు డాక్యుమెంట్‌ను తన చెల్లెలు ఇంట్లో భద్రపరిచింది. సంవత్సరాలు గడిచినా సరళమ్మ రాకపోవడం, ఇప్పటివరకు ఆమె ఆచూకీ కూడా లభించలేదు. దాంతో సరళమ్మ చెల్లెలు కుమారుడు తనకు తెలిసిన మున్సిపల్ ఉద్యోగి (బిల్ కలెక్టర్) వద్దకు వచ్చి ఆ డాక్యుమెంట్ వివరాలు తెలియజేసి ప్లాట్ ఎక్కడో ఉందో చూపించాలని కోరాడు. అతని నుంచి డాక్యుమెంట్ తీసుకున్న సదరు ఉద్యోగి తన ఇంట్లో అద్దెకు ఉంటున్న ఎల్లమ్మనే ఆలియాస్ సరళమ్మ అని చెప్పి రిజిస్ట్రేషన్ అధికారులను బురిడీ కొట్టించి తన భార్య పేరు మీద 270 గజాల ప్లాట్‌ను రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు విశ్వసనీస వర్గాల తెలిసింది. దాంతో విషయం తెలుసుకున్న సరళమ్మ చెల్లెలు కుమారుడు మున్సిపల్ ఉద్యోగి తనను మోసం చేసి అక్రమంగా ప్లాట్ రిజిస్ట్రేషన్ చేయించున్నాడని నల్లగొండ టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దాంతో ప్లాట్ డాక్యుమెంట్ వివరాలు, రిజిస్ట్రేషన్ వివరాలు అన్ని సమగ్రంగా పరిశీలించిన టూటౌన్ పోలీసులు సదరు మున్సిపల్ ఉద్యోగిపై కేసు నమోదు చేసినట్లు తెలిసింది. ఈ ప్లాట్ అక్రమ రిజిస్ట్రేషన్ వ్యవహారం బయటికి పొక్కడంతో కార్యాలయంలో సంచలనం రేపుతుంది.

నిజాయితీ కలిగిన ఉద్యోగులకు చెడ్డపేరు

మున్సిపల్ కార్యాలయానికి వచ్చి వెళ్లే వారి వివరాలు తెలుసుకోవడం, ఏ పని ఉన్నా తాము చేసి పెడుతామని కొందరు ఉద్యోగులు చేస్తున్న ఈ అక్రమ దందాతో మున్సిపాలిటీలో పనిచేస్తున్న నిజాయితీ ఉద్యోగులకు కూడా చెడ్డపేరు తెచ్చి పెడుతోదని ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొందరు ఉద్యోగులు తమ సెక్షన్ (విభాగం) కాకపోయినా వివిధ పనుల కోసం వచ్చే వారి పనులను తెలుసుకొని డబ్బులు తీసుకుని పైరవీలకు తెరలేపుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో మున్సిపాలిటీలో చోటు చేసుకున్న అక్రమాల కారణంగా అప్పట్లో మున్సిపల్ ఉద్యోగులపై కేసు నమోదై 23 మంది సస్పెండ్ అయిన విషయం తెలిసిందే. తాజాగా మరోసారి మున్సిపల్ ఉద్యోగిపై కేసు నమోదు కావడంతో మరోసారి చర్చానీయాంశంగా మారింది.

బీసీ రిజర్వేషన్లను అడ్డుకోవద్దు

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

నల్లగొండ టౌన్: బీసీ రిజర్వేషన్లను అడ్డుకుంటే సహించబోమని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఆదివారం నల్లగొండలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, బీజేపీ నాయకులు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని విమర్శించారు. బీసీ జాబితాలో ముస్లింలను కలిపారనే నెపంతో కేంద్ర ప్రభుత్వం రిజర్వేషన్లను అడ్డుకోవడానికి కుట్ర చేస్తోందన్నారు. రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు తమ వైఖరి మార్చుకోకపోతే వారి పర్యటనలను అడ్డుకుంటామన్నారు. బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని ఈనెల రెండో వారంలో సడక్ బంద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఆయన తెలిపారు. రిజర్వేషన్ల విషయంలో చర్చించడానికి బీజేపీ నాయకులు ముందుకు రావాలని ఆయన సవాల్ విసిరారు. హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియం , సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఎక్కడైనా సరే అని ఆయన ఛాలెంజ్ చేశారు. అవసరమైతే హైదరాబాద్ బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో చర్చకు కూడా సిద్ధమే అన్నారు. బీసీ రిజర్వేషన్ల గురించి మోదీ మాట్లాడకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఓసీ అయి కూడా బీసీ రిజర్వేషన్లకు మద్దతు తెలిపారని హర్షం వ్యక్తం చేశారు. రాహుల్‌గాంధీ కూడా బీసీ రిజర్వేషన్లకు మద్దతు తెలపడం హర్షణీయమన్నారు. సమావేశంలో ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాసోజు విశ్వనాథం, నేలపట్ల సత్యనారాయణ, నాయకులు బొల్లేటి రమేష్, గోపాలకృష్ణ, ఆదినారాయణ, కేసబోయిన శంకర్, నల్ల మధు యాదవ్, లాలయ్య, కృష్ణగౌడ్ పాల్గొన్నారు.





నార్కట్‌పల్లి వద్ద ఫ్లై ఓవర్ దిగే ప్రదేశంలో ధ్వంసమైన రోడ్డు, చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామ శివారులో హైదరాబాద్ వైపునకు వెళ్లే దారిలో దెబ్బతిన్న నేషనల్ హైవే

హైవే అధ్వానం

చిట్యాల, నార్కట్‌పల్లి : హైదరాబాద్ – విజయవాడ 65వ నంబర్ జాతీయ రహదారి పలుచోట్ల ధ్వంసమైంది. ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్నది. నల్లగొడ జిల్లా చిట్యాల, నార్కట్‌పల్లి మండలాల పరిధిలో ఈ హైవేపై గుంతలు ఏర్పడ్డాయి. కొన్నిచోట్ల రెండు మీటర్ల పొడవు మేర రోడ్డు పొరలు లేచిపోయాయి. ముఖ్యంగా చిట్యాల పట్టణ శివారులో, పెద్దకాపర్తి గ్రామ శివారులో, నార్కట్‌పల్లి ఫ్లై ఓవర్ వద్ద ఈ రోడ్డు ఎక్కువగా దెబ్బతిని వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. అంతేకాకుండా ఈ రోడ్డుపై ఫీటు మేర అక్కడక్కడ గుంతలు పడ్డాయి. వీటి మీదుగా ప్రయాణించే ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి పడిపోతున్నాయి. జాతీయ రహదారిపై వెంటనే మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు. గతంలో జీఎంఆర్ సంస్థ రోడ్డు నిర్వహణ బాధ్యత చూసుకుంది. ప్రస్తుతం టోల్‌గేట్ నిర్వహిస్తున్న నేషనల్ హైవే అధికారులు పర్యవేక్షణ చేయకపోవడంతోనే రోడ్డు ధ్వంసమవుతోంది. సంబంధిత అధికారులు పర్యవేక్షించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

క్లుప్తంగా

స్కూటీని ఢీకొన్న ట్రాక్టర్.. బాలిక మృతి

గుర్రంపోడు : స్కూటీని ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో బాలిక మృతిచెందింది. ఈ ఘటన గుర్రంపోడు మండలంలోని లక్ష్మీదేవిగూడెం స్టేజీ వద్ద ఆదివారం చోటుచేసుకుంది. కొండమల్లేపల్లి మండలం చినఅడిశర్లపల్లి గ్రామానికి చెందిన కూర రాధ, కూర వెంకటయ్య దంపతులు. వీరికి పౌర్ణమి కుమార్తె ఉంది. వెంకటయ్య గ్రామంలోనే వ్యవసాయం చేస్తుంటాడు. రాధ నల్లగొండలోని హాస్టల్‌లో వంట పనులు చేస్తూ కుమార్తె కూర పౌర్ణమి(16)తో కలిసి నల్లగొండలో నివాసం ఉంటుంది. గుర్రంపోడులో ఉంటున్న తన చెల్లెలు ఇంటికి రాధ తన కుమార్తె పౌర్ణమితో స్కూటీపై వెళ్లి వస్తోంది. ఈక్రమంలో లక్ష్మీదేవిగూడెం స్టేజీ వద్ద వీరి స్కూటీని ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. దీంతో స్కూటీ వెనుక కూర్చున్న పౌర్ణమి మృతిచెందింది. రాధ తీవ్ర గాయాలతో నల్లగొండలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ పసుపులేటి మధు తెలిపారు.

గడ్డిమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

పెద్దవూర: గడ్డిమందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని అనంతారం గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పానుగోటి సంపత్‌రావు (86) అనారోగ్యం సమస్యతో బాధపడుతున్నాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డిమందు తాగి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి బలవన్మరణం

రాజాపేట : ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన రాజాపేట మండలంలోని రఘునాథపురం గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ అనీల్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గడ్డమీది మల్లేశంకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కుమారుడు గడ్డమీది రాజు (25) వ్యవసాయం చేస్తున్నాడు. శనివారం సాయంత్రం 6గంటలకు బయటకు వెళ్లి వస్తానని ఇంటి నుంచి బైక్‌పై వెళ్లి రాత్రి అయినా ఇంటికి రాలేదు. తండ్రి మల్లేశం తెల్లవారుజామున 5గంటలకు తన వ్యవసాయ బావివద్దకు వెళ్లి చూడగా పశువుల కొట్టంలో మంచంపై పడి ఉన్నాడు. ట్రాక్టర్ ఫైనాన్స్‌తోపాటు మరొకొన్ని అప్పులు ఉండడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నట్లు తండ్రి ఫిర్యాదు ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అనీల్‌కుమార్ తెలిపారు.

పులిచింతల ప్రాజెక్టుకు 21,338 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

మేళ్లచెరువు : చింతలపాలెం మండలంలోని పులిచింతల ప్రాజెక్టుకు వరద నీరు భారీ వచ్చి చేరడంతో ఆదివారం రాత్రి వరకు ప్రాజెక్టులో నీటిమట్టం పూర్తిస్థాయికి చేరినట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టుకు 21,338 క్యూసెక్కుల వరదనీరు వస్తుండగా అవుట్ ఫ్లో 19,000 క్యూసెక్కులు ఉందని పేర్కొన్నారు. 19,000 క్యూసెక్కుల నీటిని ఉపయోగిస్తూ నాలుగు యూనిట్ల ద్వారా 105 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

సాగర్‌కు పర్యాటకుల తాకిడి

- సుమారు ఐదు కిలోమీటర్ల మేర నిలిచిపోయిన వాహనాలు
- మధ్యాహ్నం సమయానికి గేట్లు మూసివేయడంతో నిరాశతో వెనుదిరిగిన పర్యాటకులు


లాంచీ వద్ద కిక్కిరిసిన పర్యాటకులు

నాగార్జునసాగర్: కృష్ణమ్మ పరవళ్లను చూసేందుకు నాగార్జునసాగర్‌కు పర్యాటకులు వేలాదిగా తరలివచ్చారు. ఆదివారం సెలవుదినం కావడంతో పర్యాటకులతో కిటకిటలాడింది. బుద్ధవనం నుంచి సాగర్‌డ్యాం దిగువనగల విద్యుదుత్పాదన కేంద్రం నుంచి రేడియల్ క్రస్ట్‌గేట్ల వరకు సుమారు ఐదు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. కొత్త బ్రిడ్జి, విజయ విహార్, లాంచీస్టేషన్, బుద్ధవనం, పైలాన్‌లోని గ్యాలరీల రోడ్లు, పాలిటెక్నిక్ కళాశాల రోడ్డు, బ్యాంకు పార్కు, పైలాన్ శంకుస్థాపన పిల్లర్ నుంచి బస్టాండు మీదుగా జెన్‌కో కార్యాలయం వరకు జనంతో కిటకిట లాడింది. బుద్ధవనం పరిసరాలు, పార్కులు, విజయవిహార్ వెనుక భాగం పార్కులో పర్యాటకులు భోజనాలు చేసి సేదతీరారు. లాంచీ విహారం చేసేందుకు సరిపోయేటన్ని లాంచీలు లేకపోవడంతో పర్యాటకులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. లాంచీ టికెట్లు దొరకని పరిస్థితి నెలకొంది. వాహనాల రద్దీ ఉండడంతో కొత్తబ్రిడ్జితోపాటు ఇటు ముత్యాలమ్మ గుడి వరకు వేరే రూట్లలో ట్రాఫిక్‌ను మళ్లించారు.


నదీతీరం వద్ద ట్రాఫిక్ జామ్


పార్కులో సేదదీరుతున్న పర్యాటకులు

నిరాశలో పర్యాటకులు

ఆదివారం ఉదయం 14 రేడియల్ క్రస్ట్‌గేట్ల ద్వారా నీటిని విడుదల చేశారు. శ్రీశైలం జలాశయం నుంచి వచ్చే వరద తగ్గడంతో గేట్లను ఒక్కొక్కటిగా మూసివేస్తూ వచ్చారు. మధ్యాహ్ననికి గేట్లు పూర్తిగా మూసివేయడంతో పర్యాటకులు నిరాశకు గురయ్యారు.

నీటి విడుదలకు 58 ఏళ్లు


- 1967 ఆగస్టు 4న సాగర్ కుడి, ఎడమ కాల్వలకు నీరు విడుదల చేసిన అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ


ఎడమకాల్వకు నీటిని విడుదల చేసిన అనంతరం పరిశీలిస్తున్న ఇందిరాగాంధీ (ఫైల్)

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్ ప్రాజెక్టు కాల్వలకు నీటిని విడుదల చేసి నేటికి 58 ఏళ్లు పూర్తయ్యాయి. కృష్ణానదిపై నిర్మించిన బహుళార్థకసాధక ప్రాజెక్టు అయిన నాగార్జునసాగర్ మానవనిర్మిత ఆనకట్టల్లో ప్రపంచంలోనే అతిపెద్దది. 1967 ఆగస్టు 4న అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ కుడి, ఎడమ కాల్వలకు నీటిని విడుదల చేసి, నాగార్జునసాగర్ ప్రాజెక్టును జాతికి అంకితం చేసింది. 1955 డిసెంబర్ 10 నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్మాణానికి అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ శంకుస్థాపన చేయగా 12 సంవత్సరాల అనంతరం ఆయన కుమార్తె ఇందిరాగాంధీ సాగర్ ఆయకట్టుకు నీటిని విడుదల చేశారు. ఆనాడు రైతుల కళ్లలో ఆనందం తొణికిసలాడింది. కాల్వల్లో నీరు పారడంతో బీళ్లుగా ఉన్న భూముల్లో రైతులు సిరులు పండాయి. రైతులు ఆర్థికంగా బలపడ్డారు. తాగు, సాగునీటికి కొదవ లేకుండా పోయింది. ఆయకట్టుపరిధిలోని గ్రామాలు పట్టణాలుగా మారాయి. మిర్యాలగూడ,కోదాడ,ఖమ్మం లాంటి చిన్న చిన్నగ్రామాలు నేడు పెద్ద,పెద్ద పట్టణాలుగా రూపుదిద్దుకున్నాయి. హాలియా, నేరెడుచర్ల, హుజూర్‌నగర్ లాంటి పల్లెలు నేడు ఆర్థికంగా, వ్యాపారపరంగా అభివృద్ధిపథంలో ఉన్నాయి. జనాభాపెరిగిన మేజర్‌గ్రామ పంచాయతీలు పురపాలక సంఘం నగరాలుగా మారాయి.

ఆశించిన మేర నెరవేరని లక్ష్యం

58 ఏళ్లు గడిచినా అనుకున్న స్థాయిలో ప్రాజెక్టు లక్ష్యం నెరవేరలేదు. ప్రాజెక్టు ఆధునీకరణలో కొన్ని ప్రాంతాలకు నీరు చేరువైనప్పటికీ మరికొన్ని ప్రాంతాల్లోని కాలువల చివరి భూములకు నేటికి నీరందడం లేదు. ప్రాజెక్టుకు కూతవేటు దూరంలో ఉన్న భూములు బీడు భూములుగానే ఉంటున్నాయి. ముందు చూపును దృష్టిలో పెట్టుకుని జలాశయం నుంచి నీటిని అదనంగా తీసుకునే అవకాశం ఉండే విధంగా కాలువ వెడల్పుగా తవ్వలేదు. మెయిన్ కాల్వ హెడ్ రెగ్యులేటర్ నుంచి డిస్ట్రిబ్యూటరీల హెడ్ రెగ్యులేటర్ల వరకు, తూములు వెడల్పు చేసి ఇన్‌టెక్ లెవల్‌ను పెంచుకునే అవకాశం లేకుండా పోయింది. ఆనాడు స్థిరీకరణలో తేలని భూములు నేడు సేద్యంలోకి వచ్చి ఆయకట్టు పెరిగింది. ప్రాజెక్టు నిర్మాణానికి ఆనాటి అంచనా వ్యయం కేవలం రూ.70కోట్లు కాగా ఆ తర్వాత మరమ్మతులకే వేలకోట్ల రూపాయలు ఖర్చు చేశారు. అయినప్పటికీ గ్యాప్ ఆయకట్టుకు (టేల్యాండ్) నీరందక పోవడంతో వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ప్రాజెక్టు ఆధునికీరణకు శ్రీకారం చుట్టారు. ప్రపంచ బ్యాంకు ఆర్థికసాయంతో రూ.4,444.44 కోట్లతో ప్రణాళిక తయారుచేసి పనులు ప్రారంభించారు. అయితే సమర్థులైన అధికారులు లేకపోవడంతో 2014లో పూర్తి కావాల్సిన పనులు జూలై 2016లో ముగిసాయి. అప్పుడే కాల్వలకు గండ్లు పడటంతో పాటు లైనింగ్ రూపురేఖలు మారాయి. ఈపనులన్నీ సమర్థవంతంగా పూర్తిచేస్తే, ప్రాజెక్టు లక్ష్యం అనుకున్న స్థాయిలో నెరవేరేది. కాలువల వ్యవస్థ, పారుదల సామర్థ్యం పెరిగి గ్యాప్ ఆయకట్టు సాగులోకి వచ్చేది.


నాగార్జునసాగర్ ప్రాజెక్టు

కాంట్రాక్టర్ల కోసమే కాళేశ్వరం నిర్మించారు

- మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి


జ్యోతి ప్రజ్వలన చేసి కంటి వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

చండూరు: డబ్బులు, కాంట్రాక్టర్ల కోసమే గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం నిర్మించిందని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఆరోపించారు. తుమ్మిడిహట్టి వద్ద నీటి లభ్యత ఉన్నా, మేడిగడ్డ వద్ద నిర్మించారని, కాళేశ్వరంలో డిజైన్ లోపం, నిర్లక్ష్యం, అవినీతి చోటుచేసుకుందని మండిపడ్డారు. ఆదివారం చండూరు మండలంలోని బంగారిగడ్డ గ్రామంలో కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్, ఫీనిక్స్ ఫౌండేషన్, శంకర కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఆరో విడత ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాబోయే కాలంలో మునుగోడులోనే కంటి ఆస్పత్రి నిర్మించి ప్రజలకు ఉచిత కంటి ఆపరేషన్లు నిర్వహిస్తామని తెలిపారు. ఇది సేవా కార్యక్రమమని, రాజకీయాలతో సంబంధం లేదన్నారు. అన్ని ప్రభుత్వమే చేయాలంటే కష్టమని, భగవంతుడు ఇచ్చిన శక్తి కొద్దీ సేవా కార్యక్రమాలు చేయడానికి ముందుకు రావాలని కోరారు. విద్య, వైద్యం తనకు రెండు కళ్లు అని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని 18 రెసిడెన్షియల్ పాఠశాలల్లో కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ద్వారా మౌలిక సదుపాయాలు కల్పించే పనులు మొదలుపెట్టామని తెలిపారు. 614 మంది పాల్గొన్న ఈ శిబిరంలో 245 మందిని ఆపరేషన్‌కు ఎంపిక చేసి, 117 మందిని వెంటనే తరలించగా.. మిగిలిన 128 మందిని మంగళవారం తీసుకెళ్లి ఆపరేషన్లు చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ మాదగోని విజయలక్ష్మి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొరిమి ఓంకారం, జిల్లా నాయకులు కావలి ఆంజనేయులు, మాజీ ఎంపీటీసీ పల్లె వెంకన్న, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

రూట్ మ్యాప్‌కు క్యూఆర్ కోడ్


యాదగిరిగుట్ట వైకుంఠద్వారం వద్ద ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్‌తో ఉన్న ఫ్లెక్సీ

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయానికి వచ్చే భక్తులు వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు రింగ్ రోడ్డులో ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఆలయ అధికారులు భక్తులకు ఆయా మార్గాలను, ఆధ్యాత్మిక వాడలోని లక్ష్మీ పుష్కరిణి, కల్యాణ కట్ట, శ్రీసత్యనారాయణస్వామి వ్రత మండపం, ప్రెసిడెన్షియల్ సూట్, తులసీ కాటేజీ, తదితర ప్రాంతాలను తెలుపుతూ క్యూఆర్ కోడ్‌తో కూడిన రూట్ మ్యాప్ ఫ్లెక్సీలను కొండపైన, కొండ కింద వైకుంఠద్వారం వద్ద ఏర్పాటు చేశారు. భక్తులకు సులభతర ప్రయాణం కోసం దీనిని ఏర్పాటు చేసినట్లు ఈఓ వెంకట్రావ్ తెలిపారు.

సాగర్ ఎడమ కాల్వ కట్టకు బుంగ

నడిగూడెం : మండల పరిధిలోని సిరిపురం గ్రామ సమీపంలోని డీప్ కట్ట వద్ద సాగర్ ఎడమ కాల్వ కట్టకు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు బుంగ పడింది. కాల్వ కట్ట మీదుగా ప్రవహించిన వర్షపు నీరు కాల్వలోకి బుంగ ద్వారా చేరుతోంది. కట్ట కింద భాగంలో బుంగ పడడంతో భవిష్యత్‌లో కట్ట తెగే ప్రమాదం ఉంది. రైతుల రాకపోకలకు ఇబ్బందికరంగా మారే అవకాశముందని సిరిపురం, చాకిరాల, శ్రీరంగాపురం గ్రామాల రైతులు వాపోతున్నారు. అధికారులు స్పందించి బుంగను పూడ్చి వేయాలని కోరుతున్నారు.


నడిగూడెం మండలం సిరిపురం ఎడమకాల్వ కట్టపై పడిన బుంగ

సాగు నీరు అందించడంలో పాలకులు విఫలం

- మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

కేతేపల్లి : శ్రీశైలం, నాగర్జునసాగర్ ప్రాజెక్టుల గేట్ల ద్వారా నీరు విడుదలవుతున్నప్పటికీ జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు కనీసం అవగాహన లేకుండా నల్లగొండ జిల్లాను ఎండబెడుతున్నారని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆరోపించారు. ఆదివారం కేతేపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికార పార్టీ నాయకులు, అధికారులు ఫొటోలకు ఫోజులు ఇవ్వడం తప్ప కాల్వల ద్వారా పూర్తి స్థాయిలో చివరి ఆయకట్టు వరకు నీరందించలేకపోతున్నారని మండిపడ్డారు. ఇరిగేషన్ శాఖ మంత్రి ముందు చూపు లేకే ఈపరిస్థితులు నెలకొన్నాయన్నారు. సీజన్‌లో నీరందక నల్లగొండ జిల్లా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. నకిరేకల్ నియోజవర్గంలో విచ్చలవిడిగా ఇసుక దందా నడుస్తున్నా అరికట్టడంలో అధికార యంత్రాంగం విఫలమైందని విమర్శించారు. సమావేశంలో మాజీ మార్కెట్ చైర్మన్ కొప్పుల ప్రదీప్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మారం వెంకట్‌రెడ్డి, నాయకులు గుర్రం గణేష్, గోలీ వేణు, మాధవరెడ్డి, కొండ సైదులు, వంటల చేతన్ తదితరులు పాల్గొన్నారు.

లారీ బీభత్సం

- వాహనదారులు, పాదచారులపైకి దూసుకువచ్చిన లారీ
- ఇద్దరు మృతి, ఒకరికి గాయాలు


ప్రమాదానికి కారణమైన లారీ

భువనగిరి: భువనగిరి పట్టణంలోని జగదేవ్‌పూర్ చౌరస్తాలో లారీ బీభత్సం సృష్టించింది. జగదేవ్‌పూర్ రోడ్డు మార్గం నుంచి చెన్నైకు వెళ్తున్న లారీ వేగంగా దూసుకురావడంతో ఇద్దరు మృతి చెందగా.. ఒకరికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా కోహిర్ మండలం పోతిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన చిలమామిడి రామకృష్ణ(35), చిలమామిడి సాయి కుమార్(22) హైదరాబాద్‌లోని సూరారం కాలనీలో కొంతకాలంగా నివాసం ఉంటున్నారు. రామకృష్ణ ప్రైవేట్ కంపెనీలో మేనేజర్‌గా, సాయికుమార్ కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం భువనగిరి పట్టణంలోని సంతోష్‌నగర్‌లో నిశ్చితార్థం వేడుకకు బంధువులతో కలిసి వచ్చారు. నిశ్చితార్థం జరుగుతున్న క్రమంలో స్వీట్స్ కోసం రామకృష్ణ, సాయికుమార్ ఇద్దరూ కారులో పట్టణంలోని జగదేవ్‌పూర్ చౌరస్తాకు బయలుదేరారు. కారును రోడ్డు పక్కన పార్కింగ్ చేసి షాపు దగ్గరకు వెళ్తున్నారు. ఇదే సమయంలో రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన లారీ ఉత్తర ప్రదేశ్ నుంచి జగదేవ్‌పూర్ రోడ్డు మార్గం నుంచి చెన్నైకు వెళ్తున్న లారీ వేగంగా దూసుకువచ్చి అక్కడే ఉన్న పాదచారులు, ద్విచక్రవాహనదారులను ఢీకొట్టింది. దీంతో అక్కడే నిలబడి ఉన్న రామకృష్ణ మృతి చెందగా, సాయికుమార్‌తో పాటు రామన్నపేట మండలం తుమ్మలగూడెం గ్రామానికి చెందిన బీమారి శివసాయికుమార్, లారీ డ్రైవర్, క్లీనర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం సాయికుమార్‌తో పాటు శివకుమార్‌ను సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో సాయికుమార్ మృతి చెందాడు. మృతుల బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ రమేష్ తెలిపారు. మృతుడు రామకృష్ణకు భార్య ఇద్దరు కుమార్తెలు, సాయికుమార్‌కు భార్య, కుమార్తె ఉన్నారు.


రామకృష్ణ (ఫైల్)


సాయికుమార్ (ఫైల్)

ధ్వంసమైన షాపులు, బైకులు

లారీ వేగంగా దూసుకురావడంతో రోడ్డు పక్కన ఉన్న టీ స్టాల్, పాన్ షాప్‌లు, అక్కడే ఉన్న మూడు బైకులు ధ్వంసమయ్యాయి. మృతుడు లారీ, గోడ మధ్యన ఇరుక్కుపోవడంతో పోలీసులు క్రేన్ సాయంతో లారీని తొలగించి మృతదేహాన్ని బయటకు తీశారు. జిల్లా కేంద్ర ఆస్పత్రి వద్ద మృతుల కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి.

వాహనాల బ్యాటరీలు చోరీ చేస్తున్న ఇద్దరు అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న చండూరు సీఐ ఆదిరెడ్డి

నల్లగొండ: వాహనాల్లో బ్యాటరీల చోరీలకు పాల్పడుతున్న ఇద్దరిని కనగల్ పోలీసులు అరెస్టు చేసినట్లు చండూరు సీఐ ఆదిరెడ్డి తెలిపారు. కేసు వివరాలను ఆదివారం కనగల్ పోలీస్‌స్టేషన్‌లో వెల్లడించారు. కనగల్ మండల పరిధిలోని కేబీ తండా గ్రామానికి చెందిన కోమటిరెడ్డి కరుణాకర్ రెడ్డి తన వ్యవసాయ క్షేత్రం వద్ద తన మోటార్ సైకిల్‌ను పార్క్ చేశాడు. వ్యవసాయ పనులకు వెళ్లి వచ్చే సరికి గుర్తు తెలియని వ్యక్తులు బైక్‌ను చోరీ చేశారు. దీంతో కనగల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఆదివారం ఉదయం పోలీసులు కనగల్ క్రాస్ రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఇద్దరు వీరిని చూసి వాహనం వెనుకకు తిప్పుకుని వెళ్తుండగా పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. నిందితులు నేరం అంగీకరించడంతో అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి బైక్, రూ.లక్షా 45 వేలు విలువ చేసే 20 బ్యాటరీలు, రూ. 24 వేలు నగదు, ఆటో, ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు సముద్రాల కృష్ణ నల్లగొండలో ఉంటూ కూలి పని చేస్తుంటాడని, మరో నిందితుడు షేక్ టిప్పు సుల్తాన్ అలియాస్ సుల్తాన్ నల్లగొండలో ఉంటూ హౌష్ షిఫ్టింగ్ మూవర్, ప్యాకర్‌గా పని చేస్తాడని పోలీసులు తెలిపారు. వీరిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు చెప్పారు. కేసును ఛేదించిన సబ్ ఇన్‌స్పెక్టర్ రాజీవ్ రెడ్డి, పోలీసు సిబ్బంది రవీందర్‌రెడ్డి, వెంకన్న, శేఖర్, సురేశ్, రమేష్, వెంకట్ రెడ్డిని చండూరు సీఐ ఆదిరెడ్డి అభినందించారు.

యాదగిరి క్షేత్రంలో భక్తుల సందడి


శ్రీస్వామి దర్శనం కోసం ఆలయ ముఖ మండప క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. ఆదివారం సెలవు రోజు కావడంతో వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు అధికంగా శ్రీస్వామి వారిని దర్శించుకునేందుకు వచ్చారు. దీంతో శ్రీస్వామి వారి ధర్మ దర్శనానికి 3గంటలు, వీఐపీ దర్శనానికి 45నిమిషాల సమయం పట్టింది. భక్తులు అధికంగా రావడంతో ఆలయ మాడ వీధులు, క్యూలైన్లు, క్యూకాంప్లెక్స్, ప్రసాద విక్రయశాల, బస్టాండ్ వంటి ప్రాంతాల్లో భక్తుల సందడి కనిపించింది. శ్రీస్వామి వారిని 35వేల మందికి పైగా భక్తులు దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. వివిధ పూజలతో శ్రీస్వామి వారికి నిత్యాదాయం రూ.44,57,014 వచ్చినట్లు ఆలయాధికారులు వెల్లడించారు.

ప్రతి భక్తుడికి 30గ్రాములకు తగ్గకుండా ప్రసాదం


పశ్చిమ రాజగోపురం మార్గంలో ప్రసాద వితరణను పరిశీలిస్తున్న ఈవో వెంకట్రావ్

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఉచిత ప్రసాదం 30 గ్రాములకు తగ్గకుండా అందించాలని ఈఓ వెంకట్రావ్ ప్రసాద విక్రయ విభాగం అధికారులను ఆదేశించారు. ఆదివారం ప్రసాద వితరణను ఆయన పరిశీలించారు. ఆలయ భద్రతకు సంబంధించి ఆలయ లోపలి భాగం, ఆలయ పరిసరాల్లో కట్టుదిట్టంగా చేయాలన్నారు. ఆలయంపై డ్రోన్స్ ఎగురకుండా నిషేధించుటకు భద్రత సిబ్బందికి అవసరమైన ప్రత్యేక శిక్షణ ఇవ్వాలన్నారు. శ్రీస్వామి వారి దర్శనం అనంతరం భక్తులను పశ్చిమ రాజగోపురం నుంచి (ప్రసాద వితరణ మార్గంలో) మాత్రమే బయటకు అనుమతించాలని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

సూర్యాపేట : సూర్యాపేటలోని జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. రాయినిగూడెం గ్రామానికి చెందిన గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి (50) ఆదివారం సూర్యాపేట శివారులోని ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన తన సమీప బంధువు ఉద్యోగ విరమణ కార్యక్రమానికి హాజరై బైక్‌పై తిరిగి వస్తున్నాడు. హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్తున్న కారు వేగంగా ఈయన బైక్‌ను ఢీ కొట్టింది. దీంతో శ్రీనివాస్ రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని స్థానిక జనరల్ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యులు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

కాలువలోకి దూసుకెళ్లిన సిమెంట్ ట్యాంకర్

అర్వపల్లి: నకిరేకల్– తానంచర్ల 365 హైవేపై అర్వపల్లి శివారులో తుంగతుర్తి రోడ్డు వెంట ఎస్సారెస్పీ కాలువలోకి ఆదివారం సిమెంట్ ట్యాంకర్ దూసుకెళ్లింది. హైదరాబాద్ నుంచి అర్వపల్లి మీదుగా భద్రాచలం వెళ్తున్న సిమెంట్ ట్యాంకర్ సీతారాంపురం సమీపంలో రోడ్డు కల్వర్టును ఢీకొని కాలువలోకి వెళ్లింది. ట్యాంకర్ డ్రైవర్‌తో పాటు అందులో ప్రయాణిస్తున్న వారు బయటకు దూకి ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. అయతే డ్రైవర్ నిద్రమత్తులో ఉండటంతో ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు.

మత్స్యగిరి ఆలయ సమీపంలో యాచకుడు మృతి

వలిగొండ : మండలంలోని వెంకటాపురంలో గల శ్రీమత్స్యగిరి లక్ష్మీనరసింహ స్వామి ఆలయ ప్రాంగణంలో యాచకుడు మృతి చెందాడు. మత్స్యగిరి ఆలయ సమీపంలో లింగస్వామి అనే వృద్ధుడు(65) కొంత కాలంగా యాచకుడిగా కొండపైన జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం యాగశాల వద్ద మృతి చెంది ఉండగా.. గమనించిన సిబ్బంది ధర్మకర్తల మండల చైర్మన్ కొమ్మారెడ్డి నరేష్ కుమార్ రెడ్డికి చెప్పారు. ఈ విషయాన్ని ఆయన స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. ఈమేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్సై యుగంధర్ తెలిపారు.

మినీ శిల్పారామంలో చిన్నారుల నృత్య ప్రదర్శన

భువనగిరి: భువనగిరి మండలం రాయగిరి చెరువు సమీపంలోని మినీ శిల్పారామంలో ఆదివారం రాష్ట్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన చిన్నారులు నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. యాదగిరీశుడి సన్నిధికి వచ్చిన భక్తులు తిరుగుపయనంలో మినీ శిల్పారామాన్ని సందర్శించి నృత్య ప్రదర్శన తిలకించారు.



గుట్కా ప్యాకెట్లు స్వాధీనం

చౌటుప్పల్ : పట్టణ కేంద్రంలోని పలు దుకాణాల్లో ఆదివారం పోలీసుల తనిఖీలు చేశారు. దుకాణాల్లో నిల్వ ఉంచిన నిషేధిత గుట్కా ప్యాకెట్లను, విక్రయించేందుకు సిద్ధంగా ఉంచిన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.